# రిక్షావాడు

నేను బజార్లో నిలబడ్డవాణ్ణి నిలబడ్డట్టు ఎగిరిగంతేశాను. చేతులోవున్న రిక్షా వెనక్కి దొర్లి దొర్లి లాంతరు స్తంభానికి గుద్దుకుంది. లాంతరు స్తంభం ఏమీ అనలేదు. చూస్తూ నిలబడింది. లాంతరు స్తంభం నా రిక్షాను చూస్తూ నిలబడితే, బజార్నపోయేవాళ్ళంతా నన్నుచూస్తూ నిలబడిపోయారు, 'రిక్షా లాగుతూ పొట్టపోసుకునే నీకు ఇంత సంతోషం ఎందుకు వచ్చింది' అని అడుగుతారు. 'రాగూడదే' అని అంటారు. చెపుతాను—

నాది నల్లగొండ తాలూకాలో ఒకచిన్న పల్లెటూరు. ఆ పల్లెటూళ్ళో వున్న అందరికి మల్లేనే, నేనూ వ్యవసాయం చేసుకొని పొట్ట పోసుకునేవాణ్ణి. నాకు వున్నది నాలుగు ఎకరాలే అయినా దాన్నే నమ్ముకొని కాలం గడిపేవాణ్ణి. మా తాలూకాలో అక్కడక్కడా చెరువులు, బావులూ వున్నా వ్యవసాయం ఎక్కువ భాగం వానలమీదే ఆధారపడి వుండేది.

అటువంటిది ఒక కాలాన, వరుసగా నాలుగేళ్ళు వాన చినుకే పడకుండా పోయింది. ఇక రైతుల కడగండ్లు ఏమని చెప్పను ? రాలిపోయినవాళ్లు రాలిపోయారు. వూళ్ళోనుంచి లేచి పోయినవాళ్ళు లేచిపోయారు. ఉన్నవాళ్ళు కళ్ళల్లో కొనవూపిరి పెట్టుకొని ఇప్పటికా, ఇంకా కాసేపటికా - అని

బ్రతుకును ఈడిస్తున్నారు. నాకేమీ పాలుపోలేదు. నా సంగతీ నా పెళ్ళాం బిడ్డలసంగతీ అటుంచండి. నా ముసలి తల్లి ఇంకా బ్రతికే వుంది - నన్ను కని పెంచినతల్లి—ఇన్నాళ్ళూ ఎట్టాగో ఆమె ప్రాణాలు నిలబెట్టుకుంటూవచ్చా. ఇంకేం చెయ్యాలి?

కొండమీదకు వెళ్ళి ఏదో ఆకు దులుపుకు వచ్చే వాణ్ణి. ఇంత గంజికాసుకొని ముందు ఆమెకిచ్చి మిగిలింది అందరం తలాకాస్తా తాగేవాళ్ళం. ఇప్పుడు ఆ ఆకుకూడా కరువైంది. ఎండలకు కొండ, మంగలంకాలినట్లు కాలిపోతూ వుంది. ఎక్కడిమొక్క లక్కడే మాడిపోయినై.

ఆ రాత్రి ఉత్తచేతుల్తో రావటం అమ్మ చూచింది. ఒక్కసారి పిల్లల మొహాలలోకి చూచింది, వూరుకుంది. బావురుమని ఏడవడానికి ఆమెకు ఓపికఎక్కడుంది? కన్నీరు రాల్చటానికి తడి ఎక్కడుంది? చెంగుపరచుకొని కాళ్ళు డొక్కల్లోకి ముడుచుకొని పడుకుంది. ఆమె చచ్చిపోవటానికి సిద్ధపడుతూ వుందని నాకు అర్థమైంది. ఏం చెయ్యను! కన్నతల్లిని చావుకు ఒదిలి చూస్తూ వూరుకోవలసిందేనా?

ఆ రాత్రే పట్టణానికి బయలుదేరాను. పట్టణంలో ఏదో ఒక విధంగా బ్రతకవచ్చని మా వాళ్ళు అనుకోవటం నేను అనేకసార్లు వింటూ వచ్చాను. ఆ మధ్య పట్టణంనుంచి ఒకాయన వచ్చాడు. పట్టణం ఒస్తే తను పని చూపిస్తానన్నాడు. వెళ్ళటానికి రైలు ఛార్జీ తనేపెట్టుకుంటానన్నాడు. చాలామంది ఆయన్తో పాటు వెళ్ళారు కూడా. నేను వెళ్ళలేదు. మా అమ్మ ఒప్పుకోలేదు. 'గేదెల్నీ, దున్నల్నీ అమ్మి

పట్లు నిన్ను అమ్మేస్తార్రా' అంది. 'రైలు పెట్టెల్లో కుక్కి ఏ రంగమో తోల్తారు' అంది. 'చావాల్సి ఒస్తే పుట్టినూరూ, మెట్టినూరూ ఇక్కడే చద్దాం. చావక ఎవరైతేమాత్రం ఎల్లకాలం బ్రతుకుతార్రా ?' అంది.

నేను ఆమె మాటకు ఎదురు చెప్పలేక పోయాను. ఉండిపోయాను. అప్పటికి మా వూరి పరిస్థితులు అంత ఘోరకలిగా లేవు కూడాను. పొట్టనింపుకోటానికి ఆకో, అలమో ఇంత దొరుకుతూనే వుంది. ఇంకా, ఇవాళో రేపో నాలుగు చినుకులు రాలకపోతయ్యా, మనుష్యులం కాకపోతామా ! అనే ఆశ ఆ నాటికి చావలేదు.

ఇప్పుడేముంది ? ఒకరితర్వాత ఒకరు కండ్ల ముందు దాటిపోతూవుంటే చేసేది లేక చేతులు ముడుచుకొని చూస్తూ కూర్చోటమేగా! పట్టణానికి పోతే ఇదన్నా తప్పుతుంది,

ఆ రాత్రే బయలుదేరాను. ఎవ్వరికి చెప్పినా ఒప్పుకోరని నాకు తెలుసు. ఎవ్వరికీ చెప్పకుండా బయలుదేరాను. ఎలాగో పట్టణం జేరుకున్నాను. నేను అంతకు ముందు మావూరు విడిచి పెట్టినవాణ్ణి కాదు. పట్టణాన్ని గురించి, అక్కడ వుండే మనుష్యులను గురించీ, వాళ్ళూ, వాళ్లూ చెప్పే కబుర్లు విన్నవాణ్ణికాని; ఎన్నడూ పట్టణం చూచినవాణ్ణి కాదు. ఇంకేముంది ? ఈపట్టణాన్ని చూసేటప్పటికి నాతల తిరిగిందంటే నమ్మండి ! ఈ మేడలూ, ఈ కార్లూ, ఈ బళ్ళూ, ఈ జనాలూ, నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను. మొదట్లో ఎట్లా నడవాలో తెలియలేదు. ఎటు నడచినా ఎవ్వరికో ఒకరికి అడ్డం తగులుతూనే వుండే

వాణ్ణి. ఇదంతా ఏదో తిరునాళ్లగా, పెద్ద సంతగా వుంది గాని, మామూలుగా మనుష్యులుండే వూరుగా లేదు.

ఇక్కడ పల్లెటూరికి మల్లే కాదు. ఎక్కడ చూస్తే అక్కడే అన్నం కనబడుతూ వుంది. అన్నమే కాదు, ఎక్కడ చూస్తే అక్కడే పిండివంటలు, ఎటుచూచినా తినుబండారాలే నా కళ్ళకు కనిపించినై. ఎంత ఆశ్చర్యం! పల్లెటూళ్ళలో నాలుగు మెతుకులు కనిపిస్తే, ఆ రోజు పండుగే. ఇక్కడ ఎక్కడపడితే అక్కడే అన్నం; ఎక్కడపడితే అక్కడే తినుబండారాలు. కాని, నెమ్మదిమీగ ఇంతకంటే ఎక్కువ ఆశ్చర్యకరమైన విషయం ఒకటి తెలుసుకున్నాను. ఏమిటంటారా? చెపుతాను:

తిండి పదార్థాలు వున్నమాట నిజమే. కాని, తిండి లేక అలో లక్ష్మణా అని ఏడ్చేవారు ప్రక్కనే వున్నారు. ఈ తిండికి, వాళ్ళ ఆకలికీ ఏమీ సంబంధం వున్నట్టు కన పడదు. ఒక దుకాణం లోంచి తిని తేపుతూ జనం వస్తూనే వున్నారు. ఒక బాలింతరాలు చంటిదాన్ని చేతుల్లో పెట్టు కొని, 'ఒక్క పైసా వెయ్యండి బాబూ' అని అడుగుతూనే వుంది. ఆమె మొర ఆలకించే వాళ్ళే లేరు. పోనీ, ఆ దుకాణ దారుకైనా ఆ బాలింతరాలికి ఒక ముద్దవేసి పంపించాలని తట్టలేదు. పదార్థాలన్నీ కంటికి కనపడుతూనే వున్నాయి. తినేవాళ్ళు తింటూనే వున్నారు; వెళ్ళేవాళ్లు వెళ్తూనే వున్నారు. ఆ బాలింతరాలి మొరమాత్రం ఒక్కరూ ఆల కించరు. ఏ మాశ్చర్యం ఇది! పల్లెటూళ్ళల్లో డబ్బున్న వాళ్లున్నా, దానిని ఇట్లా ప్రదర్శించరు......ఎవ్వరయినా

బిచ్చం అడిగినా నిండుకున్నాయి, అంటారు. ఉంచుకోని లేవన్నందుకు సిగ్గుపడతారు. ఇక్కడిదేమి న్యాయం? తిండిలేక మాడేవారి ముందు రకరకాల తినుబండారాలు ప్రదర్శిస్తారు. కాని అవి తినే హక్కు వారికిలేదు. ఇదేమి అన్యాయమో!

నేను ఆ పంపులో, ఈ పంపులో నీళ్ళు తాగి రెండు రోజులు గడిపా. రెండోరోజు నా అదృష్టవశాత్తూ మావూరు ఒచ్చి పట్టణంలో పని చూపిస్తానని చెప్పిపోయినాయన కనిపించాడు. ఆయన్ని చూడగానే ప్రాణంలేచివచ్చింది. దణ్ణం పెట్టి రక్షించమన్నాను. ప్రాణంకాపాడమన్నాను. ఆయన అక్కడ కొన్ని రిక్షాలకు యజమా, అని నా కప్పుడు తెలిసింది.

"రిక్షా లాగుతావా" అని అడిగాడు.

నేను ఒక్కసారి కలయజూశాను. ఎక్కడ చూచినా రిక్షాలు లాగేవాళ్లే! తప్పేమి ఉంది? ఇంటి దగ్గర వాళ్ళని బ్రతికించుకోవటానికి ఏ ఉపాయం అయితేం! 'వూ!!' అన్నాను.

ఆనాటినుంచీ ఈనాటివరకూ రిక్షా లాగుతున్నాను. నెలనెలా కొద్దో గొప్పో డబ్బు ఇంటికి పంపుతున్నాను. దానితో మావాళ్ళు ప్రాణాలు నిలబెట్టుకుంటున్నారు. కాని ఎన్నాళ్ళు ఇలా? నేను డబ్బయితే సంపాదిస్తున్నానుగాని, నా మనస్సుకి ఇదివరకు వున్న హాయిలేదు. నాలో ఇంతకు ముందు ఉన్నదీ, తప్పకుండా వుండవలసిందీ, ఏదో పోయి నట్లు అనిపిస్తూవుంది. మొదట్లో "రిక్షా ఎక్కుతారా?" అని

ఎవ్వరినైనా అడగటానికే సిగ్గువేసేది. రిక్షాలో కూర్చున్న వాళ్ళని చూస్తే నవ్వు ఒచ్చేది. ఎంత ఆపుకుందామన్నా ఆగేది కాదు. అందుకని తలవంచుకొని వాళ్ళు ఎంత ఇస్తే అంత తీసుకొని పోతుండేవాణ్ణి.

నేనున్నచోటికి దగ్గరగా ఒక పెద్దమనిషి పొద్దున్న పదింటికి ఒక లాంగ్‌కోటూ, జరీ తలపాగా పెట్టి ఆఫీసుకి బయలుదేరేవాడు; ఆయనకు రెండు మేడలున్నాయి. ఒక మేడలో తనుండేవాడు. రెండో మేడ అద్దెకిచ్చేవాడు. బాగా డబ్బున్నవాడని అందరికీ ఆయనంటే గౌరవం. నేను రిక్షా లాగటం మొదలుపెట్టిన తర్వాత ఆయన నా దగ్గరకు వచ్చి, "ఎంతకి కడతావ్ ?" అని అడిగాడు. "బాగామ్" దగ్గరకు అని చెప్పాడు. "మీ ఇష్టం" అన్నాను. "రెండణాలు" అన్నాడు. నేను ఒప్పుకున్నాను.

అప్పటినుంచీ ఎప్పుడూ నా రిక్షాలోనే వెళ్ళేవాడు. నన్నుచూచి జాలిపడి మంచివాడికి సహాయం చెయ్యాలనే ఉద్దేశంతో నా రిక్షాలో ఎక్కుతున్నట్టు రోజుకొకసారైనా చెప్పేవాడు. నేను ఎక్కడున్నా వెతుక్కుంటూ ఒచ్చేవాడు. మొదట్లో నేను ఆయన మాటలునమ్మా. తరువాత అక్కడ నుంచి బాగామ్‌కి నాలుగణాలు తీసుకుంటారనీ, ఏ పరిస్థిల్లోనూ, మూడణాలకంటే తక్కువకు ఏ రిక్షావాడూ రాడనీ తెలిసింది. ఈ సంగతి తెలిసింతర్వాత ఆయున్ని చూచినప్పుడల్లా నాకు నవ్వు వచ్చేది. ఇంత డబ్బున్నాయనకు ఒక్క అణా కోసం ఇంత తాపత్రయం దేనికో ! ! ఇంత నటనా, ఇన్ని అబద్ధాలూ దేనికో. నాలో నేను నవ్వుకునే

వాణ్ణి. ఆపుకో లేకపోయేవాణ్ణి. ఒకటిరెండుసార్లు "ఎందుకల్లా నవ్వుతావ్?" అని ఆయన అడిగారుకూడా ? ఏం చెప్పేది ? "అప్పుడప్పుడూ అట్లా వస్తుంది ఎందుకో ?" అన్నాను.

"చాల్లే వూరుకో" అనేవాడు.

ఎట్లా వూరుకు నేటట్లు ?

ఒకరోజున నేను బాగామ్ దగ్గర రిక్షా పెట్టుకొని వున్నాను. ఆయన వచ్చి ఇంటికి రిక్షా కట్టమన్నాడు. నేను సిద్ధపడేలోగా ఆయన స్నేహితుడు ఒకాయన వచ్చాడు. నల్లగా బాగాలావుగా వున్నాడు.

"నువ్వుకూడా రా, ఒకే రిక్షాలో వెళ్దాం" అన్నా డాయన.

"ముందు ఎంతకొస్తాడో అడుగు!" అన్నాడు, ఆయన స్నేహితుడు.

"ఎంతో ఒకంతలే," అన్నా డాయన.

"ఆ తర్వాత పేచీకి వస్తాడు," అన్నాడు ఆయన స్నేహితుడు.

"అటువంటివాడు కాడులే" అన్నా డాయన.

ఇద్దరూ రిక్షాలో కూర్చున్నారు. నేను సాగాను. వాళ్లు రిక్షాలో కూర్చుని అనేక రహస్యాలుమాట్లాడుకుంటున్నారు. ఇతరులకు ఏమాత్రం తెలియకూడని రహస్యాలు ? మరి నేను వింటున్నాగా !! నేను వింటున్నానేమో - అనే భయం వారి కెందుకులేదు ? నాకు అకస్మాత్తుగా జవాబు తట్టింది. నన్ను మనిషికింద వాళ్లు లెక్కకట్టటంలేదు. ఈ ఆలోచన

రావటంతోనే, నేను రిక్షా లాగటం మొదలుపెట్టిం తర్వాత జరిగిన ఎన్నో సంఘటనలు గుర్తుకు వచ్చినై. అన్నీ ఒకే విషయాన్ని రుజువుచేస్తున్నై. రిక్షా ఎక్కేవాళ్ళెవ్వరూ నన్ను మనిషిగా లెక్కకట్టటం లేదు. అంతకు ముందున్నదీ, తప్ప కుండా ఉండవలసిందీ, ఏదో పోయినట్టుం దన్నానే — అది ఇదేనేమో! ఇతరులచేత మనిషిగా చూడబడక పోవటమే నేమో! అసలు ఆ లక్షణాలు నాలో పోయినయ్యేమో!

పల్లెటూళ్ళో ఈ బాధలేదు. ఎన్ని కష్టాల్లో, ఏ పరి స్థితుల్లో వున్నా మనిషిని మనిషిగా చూస్తారు. ఇక్క డిదేమిటి? నాగుండె గుభేలు మన్నది.

ఇంతలో "నడవ్వేరా తొందరగా" అన్నాడు రిక్షాలో కూర్చున్నాయన.

నాకు "ఛో ఛో! అహహై" అన్నట్టు వినిపించింది.

"వీళ్ళకు నెమ్మదిగా చెపితే అర్థంకాదు" అన్నాడు ఆయన స్నేహితుడు.

నాకు "దీన్ని కోసుకు తిన" అన్నట్టు వినిపించింది.

"ఊఁ, నడవ్వే,… …"

నాకు చెరణాకోలతో కొట్టినట్టయ్యింది. తరువాత ఏం జరిగిందో నాకు తెలియదు. నేను పల్లంలోకి దిగుతున్నట్టూ రిక్షా నన్ను వదలి నాకంటే ముందు పోతున్నట్టూ, రిక్షాలో వాళ్ళు పెద్దపెట్టున కేకలువేస్తున్నట్టూ మాత్రం లీలగా జ్ఞాపకంవుంది. ..అంతే.

నాకు పూర్తిగా తెలివి వచ్చేటప్పటికి పోలీసుస్టేషన్లో వున్నాను. నా రిక్షా విరిగిందనీ, రిక్షాలో వున్నవారికి దెబ్బలు

తగిలాయనీ, అందుకు నా అజాగ్రత్తే కారణం అనీ, చెప్పి నను కొన్ని రోజులు జైల్లో ఉంచారు. నేను జైలునుంచి బయటకు వచ్చాను. మళ్ళా రిక్షా లాగటం మొదలుపెట్టాను. కాని ఇదివరకటి ఉత్సాహం లేదు. మనస్సు నావూరుమీదే ఉండేది. ఇట్లా ఉండగా ఇవ్వాళ మావూరునుండి ఒక మోతుబరి రైతు వచ్చాడు. రిక్షా లాగుతున్న నన్ను గుర్తుపట్టాడు. మా వూళ్ళో వర్షాలు పడ్డాయట. చెరువులు నిండాయట. మళ్ళా మావూరు పచ్చపబడ్డదట. ఇలా ఎన్నో విషయాలు చెప్పుకుపోయాడు. నా పొలం నా కళ్ళముందు ఆడింది. నన్ను పిలిచింది. ఇక నాకేం తక్కువ! నావూరు వెళ్తాను... సంతోషం పట్టలేక బజారో నిలబడ్డవాణ్ణి నిలబడ్డట్టు గంతేశాను.